## క్లుప్తంగా

### టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినులకు సామగ్రి అందిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: విద్యార్థులు లక్ష్యం పెట్టుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులు 38 మందికి పరీక్ష సామగ్రిని సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పరీక్షలంటే భయపడకూదన్నారు. ఒత్తిడిని జయించి, ప్రశాంతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో గ్రేస్ లిల్లీ, సీఆర్టీలు పాల్గొన్నారు.

### శాస్త్రశోధనలో భారతీయుల కృషి అద్వితీయం



విద్యార్థినితో మాట్లాడుతున్న శాస్త్రవేత్త జయతీర్థ రావు

కొమ్మాది: విజ్ఞాన శాస్త్ర శోధనలో భారతీయుల కృషి అద్వితీయమైనదని శాస్త్రవేత్త వి.జయతీర్థరావు అన్నారు. ఖగోళశాస్త్రం, ఆయుర్వేదం, గురుత్వాకర్షణ, గ్రహగతుల వంటి అనేక ముఖ్యమైన అంశాలను ప్రపంచానికి అందించడంలో ఆర్యభట్ట, శుశ్రుత, భాస్కరాచార్య వంటి శాస్త్రవేత్తలు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. స్థానిక నవోదయ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గణితశాస్త్రంలో సున్నను కనిపెట్టి పరిపూర్ణతను సాధించిన ఘనత కూడా మనదే అన్నారు. విద్యార్థులకు అనేక ముఖ్య విషయాలను దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా వివరించారు. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించడం, ఆలోచించడం మొదలు పెట్టాలన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఇంగ్లండ్ దేశాలకు చెందిన పలు యూనివర్సిటీల్లో బోధన చేస్తూ విశేష కృషి చేస్తున్న జయతీర్థరావు ఇక్కడ విద్యార్థులతో కలసి సమావేశాల్లో పాల్గొనడం విశేషమని ప్రిన్సిపాల్ డా.వై.ఎస్.ఎస్ చంద్రశేఖర్ అన్నారు.

### 350 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు



చిప్పాడ హైస్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు శోభారాణి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో చిప్పాడ జెడ్పీహైస్కూల్, పాత మూలకుద్దు, కొనసవానిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో 350 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి పాఠశాలకు దివీస్ యాజమాన్యం ఆరోగ్య సంరక్షణకు సంబంధించి మెటీరియల్ అందించింది. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### అబ్బురపరిచిన చిన్నారులు



సెకన్ల వ్యవధిలో పేర్లు చెపుతున్న చిన్నారులు

మధురవాడ: చిన్నారులు అద్భుత ప్రతిభ చూపారు. వైఎస్సార్‌కాలనీలో వారాహిమాత ఆలయ శంకుస్థాపనకు హాజరైన మధురవాడ వెంకటేశ్వర విద్యాసంస్థల విద్యార్థులు తమ విజ్ఞానంతో ఆకట్టుకున్నారు. 4వ తరగతి చదువుతున్న పి.భవిక రఘువంశం (శ్రీరాముని) వంశవృక్షానికి చెందిన 56 పేర్లు అనర్గళంగా చెప్పి ఆకట్టుకుంది. మరో బాలిక సీహెచ్ విష్ణు ప్రియ తెలుగు సంవత్సరాలు, నక్షత్రాల పేర్లు 30 సెకన్లలో చెప్పేసింది. 4వ తరగతి విద్యార్థి రాము వందమంది కౌరవుల పేర్లు, 5వ తరగతి విద్యార్థి ఆదేశ్ భగవద్గీత శ్లోకాలు, గురువుల గొప్పదనం తెలియజేశారు. వారిని, ఉపాధ్యాయినులను సంస్థ చైర్మన్ యేటూరి వెంకటేశ్వరరావు, లివింగ్ లైన్స్ ఎండీ శ్రీనివాసరావు అభినందించారు.

# కష్టాల కొలిమి

వారంతా పంజాబ్ రాష్ట్రానికి చెందిన సిక్కులు. ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని కొన్ని సంవత్సరాల క్రితం మన రాష్ట్రానికి వచ్చారు. పట్టణంలోని రైల్వే న్యూకాలనీలో ఉంటూ, వారు తయారు చేసిన వస్తువులను పూర్ణామార్కెట్‌లో విక్రయించి జీవనం సాగించేవారు. వారిని నగర శివారుకు తరలించిన నాటి నుంచి, అవస్థలు మొదలయ్యాయి. వారి జీవనం కష్టాల కొలిమిలో చిక్కుకున్నట్లయింది.



ఇనుప గమేళాలు తయారు చేస్తున్న వృద్ధుడు

- గిట్టుబాటు కాని వృత్తి
- కూలీలుగా మారుతున్న వైనం
- దయనీయ స్థితిలో సిక్కులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది కే1, కే2, కే3 కాలనీల్లో నివసిస్తున్న సిక్కు కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇక్కడ సుమారు 70 కుటుంబాలు ఉంటున్నాయి. వీరు ఇనుముతో పొయ్యిలు, జల్లెడలు, కలాయిలు, బక్కెట్లు, గమేళాలు, అట్లకర్రలతో పాటు మరి కొన్ని వస్తువులు తయారు చేసి, విక్రయిస్తుంటారు. వీరి వస్తువులకు డిమాండ్ లేకపోవడం, చార్జీలు పెరిగిపోవడంతో అవస్థలు పడుతున్నారు.



ఇనుప వస్తువులు తయారు చేస్తున్న సిక్కులు

### తరలింపుతో మొదలైన కష్టాలు

గతంలో వీరంతా విశాఖలోని రైల్వే న్యూకాలనీ వద్ద ఉండేవారు. ఇక్కడే ముడి సరుకులు కొని, వస్తువులను తయారు చేసి పూర్ణామార్కెట్‌లో అమ్మేవారు. అయితే వీరికి 2011వ సంవత్సరంలో కొమ్మాది కే1 కాలనీలో స్థలాలను కేటాయించి, తరలించారు. అప్పటి నుంచి వీరికి కష్టాలు ప్రారంభమయ్యాయి. వస్తువుల తయారీకి కావలసిన ముడి సరకును నగరం నుంచి ఇక్కడికి తెచ్చుకోవాలి. తయారు చేసిన వస్తువులను విక్రయించడానికి కూడా పూర్ణామార్కెట్‌కు తరలించడం ఒక సమస్యగా మారింది. దీంతో లాభం కంటే నష్టాలే ఎక్కువ అవుతున్నాయని, రవాణాఖర్చు అధిక భారంగా మారిపోయిందని వీరు వాపోతున్నారు. కనీసం రోజుకు రెండువందల రూపాయలు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలామంది కూలీలుగా మారి జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

### రవాణా చార్జీలతో అధిక భారం

ఇదే వృత్తిని ఆధారంగా చేసుకుని కుటుంబాలను పోషిస్తున్నామని, ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. వారు తయారు చేసిన వస్తువులను పూర్ణామార్కెట్, విజయనగరం, తగరపువలస వంటి ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. వస్తువులు తరలించేందుకు సరైన రవాణా లేకపోవడంతో ఆర్థిక భారం పెరిగిపోతోందని తెలిపారు. తమకు తక్కువ ఖర్చుతో రవాణా సదుపాయం కల్పించాలని, అదేవిధంగా ఈ వృత్తిపై ఆధారపడుతున్న వారికి ప్రభుత్వం లోన్లు ఇచ్చి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తమ ప్రాంతాల్లో సరైన రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

### కుటుంబ పోషణకు ఇబ్బంది



ఎంతో శ్రమపడి రోజూ ఈ వస్తువులను తయారు చేస్తున్నాం. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో నష్టాల బాటన పడుతున్నాం. ఆదాయం చాలా తక్కువగా రావడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం.

– అవతార్‌సింగ్, కే 1 కాలనీ ప్రెసిడెంట్

### ప్రభుత్వం ఆదుకోవాలి



నిత్యం ఎన్నో కష్టాలు పడుతూ రోజులు గడపాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి బయటకు రావాలి అంటే ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుని రుణ సదుపాయం కల్పించాలి. అప్పుడే ఈ కష్టాల నుంచి గట్టెక్కగలం. లేకుంటే ఇక్కట్లు తప్పవు.

– మోహన్ సింగ్, వస్తువుల తయారీదారుడు

### తరలించినప్పటి నుంచి కష్టాలే..



విశాఖలో ఉన్నప్పుడు పూర్ణామార్కెట్‌కు సరకులు తీసుకుని వెళ్లడానికి సదుపాయంగా ఉండేది. రవాణా ఖర్చు కూడా తక్కువగా ఉండటంతో లాభాలు బాగా వచ్చేవి. మమ్మల్ని ఇక్కడికి తరలించిన దగ్గర నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి.

– శక్తి సింగ్, వస్తువుల తయారీదారుడు

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పద్మనాభం: 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గంధవరం ఫీడర్ ప్రాజెక్టు పనులు చేపట్టనున్నందున ఈ ఫీడర్ పరిధిలో గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

**ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలో..**

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పాడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులవాడ తదితర గ్రామాల గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## శ్రీవారి సన్నిధిలో ప్రత్యేక వారాభిషేకాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో ప్రత్యేక వారాల్లో అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ప్రతి ఆదివారం ఆంజనేయస్వామి అభిషేకం, ప్రతి సోమవారం గురుదాల్వార్ అభిషేకం, ప్రతి శుక్రవారం వేంకటేశ్వరస్వామి అభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి నెలా పుబ్బ నక్షత్రం రోజు గోదాదేవికి అభిషేకం, ఉత్తరా నక్షత్రం రోజు పద్మావతి అమ్మవారి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. ఈ అభిషేకాల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా తమను సంప్రదించాలని తెలియజేశారు.

## కమనీయం.. శ్రీవారి కల్యాణం



కల్యాణ మూర్తులు

భీమునిపట్నం: భీమిలిలోని కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు అప్పలాచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## చంద్రంపాలెం హైస్కూల్లో ఆకతాయిల ఆగడాలు

**స్టాఫ్‌రూమ్‌లో అగ్గి వేయడంతో కాలిపోయిన కుర్చీ, పరీక్ష పేపర్లు**



కాలిపోయిన కుర్చీ, ఇతర సామగ్రి

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇక్కడ తరచూ చిన్న చిన్న గొడవలకు దిగుతున్న ఆకతాయి విద్యార్థులు పాఠశాలలో స్టాఫ్ రూం సగం తెరచి ఉన్న కిటికీలోంచి ఆదివారం ఉదయం అగ్గి విసిరారు. దీంతో గదిలోని ఓ ఫైబర్ కుర్చీ, కొన్ని కట్టల పరీక్ష పేపర్లు కాలిపోయాయి. గదిలోనుంచి పొగ వస్తున్న విషయాన్ని గమనించి వాచ్‌మన్ రమణ తక్షణమే స్పందించి గది తెరచి మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆకతాయిలను పట్టుకునే ప్రయత్నం చేయగా వారు తప్పించుకు పోయారు. ఈ ఘటన 10తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ముగిసిన తర్వాత జరిగింది. సివిల్ దుస్తుల్లో వచ్చిన పాఠశాలకు చెందిన ఆకతాయి విద్యార్థులే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న హెచ్‌ఎం రవి పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో వ్యవహారం బయటకు వచ్చింది.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రేమకుమార్

**డీఈవో ఆగ్రహం**

పాఠశాలలో సంఘటన స్థలిని డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు. కారణాలపై ఆరా తీశారు. పాఠశాలలో భద్రత పెంచేందుకు తక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. ఆదివారం ఉదయం సంఘటన జరిగితే, 24 గంటల వరకు తనకు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బాబూరావుకు నివాళులు



బాబూరావుకు నివాళులు అర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: ఇటీవల మృతి చెందిన ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు బాబూరావు సంస్మరణ సభ సోమవారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణమండపంలో జరిగింది. పలువురు నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని, ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కోలాటం ప్రదర్శించి అభ్యుదయ గీతాలు ఆలపించారు. రంగూరి సీతారామదొర, సుంకర రాంప్రసాద్, సరగడ చినరెడ్డి, పిట్ట సురేష్, కానూరి రాంబాబు, జీరు వెంకటరెడ్డి, మోర అప్పలరాజు, దల్లి అప్పలరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇసుక లారీలపై తేలని పంచాయితీ



ఆనందపురం పోలీస్ స్టేషన్ వద్ద నిలిపి ఉంచిన ఇసుక లారీలు

తగరపువలస: అధికలోడు, నకిలీ బిల్లులతో శ్రీకాకుళం నుంచి విశాఖకు రవాణా చేస్తున్న ఇసుక లారీల పంచాయితీ మూడు రోజులు గడుస్తున్నా కొలిక్కి రాలేదు. శనివారం రాత్రి జిల్లాకు చెందిన పలువురు లారీ యజమానులు ఆనందపురం వద్ద 11 ఇసుక లారీలను అడ్డుకుని, ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన కూడా చేపట్టారు. కూటమి ప్రభుత్వం తమ పట్ల ఒకలా, సాలూరు, రాజమండ్రి, విజయవాడకు చెందిన ఇసుక సరఫరాదారుల పట్ల మరొకలా వ్యవహరిస్తోందన్నారు. శనివారం రాత్రి నుంచే శ్రీకాకుళానికి చెందిన లారీల యజమానులు ఆనందపురం పోలీస్ స్టేషన్ వద్ద తిష్ట వేసి తమకు ఉన్న పలుకుబడితో లారీలను తప్పించాలని చూస్తున్నారు. మరోవైపు జిల్లాకు చెందిన లారీ యజమానులు మాట్లాడుతూ తాము అప్పగించిన లారీల యజమానుల రసీదులు పరిశీలించి, నకిలీ బిల్లులతో అధిక లోడు రవాణా చేస్తున్నందున తహసీల్దార్ సమక్షంలో సీజ్ చేయాలని, న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఏళ్ల తరబడి అసంపూర్తిగా నగరంపాలెం రోడ్డు

- కనీసం మురుగు పారే దారైనా చూపండి
- పీజీఆర్ఎస్‌లో వైఎస్సార్‌సీపీ వినతి
- జోన్–2లో 16 అర్జీలు



నగరంపాలెం రోడ్డు పూర్తి చేయాలని వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రజని, జ్యోతిష్

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల మధ్య ఉన్న నగరంపాలెం రోడ్డు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండిపోవడంతో మల్లయ్యపాలెం, సాక్షి ఆఫీసు పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆమెకు వినతిపత్రం సమర్పించారు. రోడ్డు పక్కనున్న నివాసాలు, కార్యాలయాల నుంచి మురుగునీరు బయటికి పారే అవకాశం లేక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. కనీసం మురుగునీరు పారుదలకు మార్గం చూపే పనులైనా తక్షణమే చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి చేకూరి రజని, నాయకులు జ్యోతిష్, నాగోతి చిన్నారావు, సూర్రెడ్డి తదితరులు కోరారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాని ఈఈ శాంతి రాజుకు జెడ్సీ సూచించారు.

- తమ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలన్నీ ఉన్నా పన్ను వేయకుండా రెండేళ్లుగా తిప్పుతున్నారని పరదేశిపాలేనికి చెందిన బలరామకృష్ణ ఫిర్యాదు చేశారు. జర్నలిస్టుల పేరు చెప్పి ఓ భవనం ఓనర్ నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడిన సచివాలయ కార్యదర్శిపై చర్యలు చేపట్టాలని మరో రిపోర్టర్ ఫిర్యాదు ఇచ్చారు. ఇలా జోన్ పరిధిలోని వివిధ వార్డుల పరిధిలో పలు ప్రాంతాల నుంచి 16 అర్జీలు అందాయి.

## 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో మజ్జి శ్రీనివాసరావు, కరణం ధర్మశ్రీ

తగరపువలస: ఈ నెల 12న జిల్లా కేంద్రాలలో జరిగే 'యువత పోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కోరారు. ఆనందపురం మండలం గుడిలోవలో భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీతో కలిసి యువతపోరు పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పల్ల రమణ, కోరాడ వెంకటరమణరావు, ఎస్.చంద్రమౌళి, కోన శ్రీను, తొమురోతు సత్యనారాయణ, చందక సూరిబాబు, కలిమి గంగరాజు, వెంకటరావు, బంక శ్రీను, అప్పలరాజు, వెంకటరావు, మహేష్, ఆనంద్, రాజు, కనకరాజు, బోని సన్యాసినాయుడు, నాయుడు బాబు, దేవుడు, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల ధ్వంసం



గుడిలోవ జాతీయ రహదారి వద్ద ధ్వంసమైన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలపై ధ్వంసం చేసి కూటమి కార్యకర్తలు మరోసారి రాక్షసానందం పొందారు. ఆనందపురం మండలం గుడిలోవ వద్ద సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశానికి సంబంధించి కార్యకర్తలు ఆదివారం రాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిని చూసి ఓర్వలేని కూటమి కార్యకర్తలు దుక్కవానిపాలెం, పాలవలస, గుడిలోవ ప్రాంతాలలో పలుచోట్ల వీటిని చించేశారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే వారు ఇలా దిగజారుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు.

## అన్ని వర్గాలను మోసం చేసిన 'కూటమి'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో చిన్నశ్రీను, ధర్మశ్రీ . హాజరైన ఆనందపురం మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీని టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు
- అధినేత జగన్ ఉండగా ఏ కార్యకర్తనూ టచ్ చేయలేరు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్
- ఆనందపురం మండల నాయకులతో ఆత్మీయ సమావేశం

తగరపువలస: చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గుడిలోవలో సోమవారం నిర్వహించిన ఆనందపురం మండల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియాను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు, బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. అయితే, మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత లక్షలాది మంది కార్యకర్తలు రాసే రెడ్‌బుక్‌లలో వడ్డీతో సహా బదులు తీర్చుకుంటామన్నారు. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండగా ఏ కార్యకర్తనూ టచ్ చేయలేరన్నారు. సంపద సృష్టిస్తామన్న బాబు పాలనలో వ్యాపారాలు 35 నుంచి 40 శాతానికి పడిపోయాయన్నారు. హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు చూసి భయమేస్తుందన్న ఆయన రాష్ట్రంలో అమలు చేస్తామని.. ఢిల్లీలో అమలు చేసేశామని బీరాలు పలుకుతున్నారన్నారు. భీమిలి, పాయకరావుపేట నియోజకవర్గాలలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. 2019 ఎన్నికల ముందు వచ్చి భీమిలి సీటు, మంత్రి పదవి దక్కించుకున్న ముత్తంశెట్టి 2024లో ఓటమి చెందిన తరువాత చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారన్నారు. ఇకపై వైఎస్సార్‌సీపీలో వలస పక్షులకు చోటు ఉండదన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడి రాజకీయ పరిణామాలను నిశితంగా గమనించిన వైఎస్ జగన్, చిన్న శ్రీనుకు భీమిలి అప్పగించారన్నారు.

**ప్రభుత్వానికి ప్యాకప్ చెప్పే రోజులు దగ్గర్లోనే..: ధర్మశ్రీ**

అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ 2019లో భీమిలిలో వైఎస్సార్‌సీపీని ఓటమి బాధించినా చిన్నశ్రీనును సమన్వయకర్తగా నియమించిన తరువాత ఉత్సాహంగా మారిపోయిందన్నారు. సమర్థుడైన చిన్న శ్రీను నిత్యం కార్యకర్తలకు అండగా ఉంటారన్నారు. మహిళల రక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన దిశ వాహనాలకు పేర్లు మార్చి మేకప్పులు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్యాకప్ చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

**ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటాం: చిన్న శ్రీను**

భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయ ప్రాముఖ్యత కలిగిన ఆనందపురంలో ఒకరిని ఒకరు గౌరవించుకుంటారన్నారు. వారి గౌరవం ఎక్కడా తగ్గకుండా తనతో పాటు జిల్లా నాయకత్వం, వైఎస్ జగన్ కూడా ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు. ఎవరికి చిన్న సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, దాట్ల పెదబాబు, రాష్ట్ర నాయకులు బొడ్డు అప్పలనాయుడు, పిల్లా సుజాత, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబుక్త రాంబాబు, పాండ్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బోని బంగారునాయుడు, ప్రధాన కార్యదర్శి గంగ్రెడ్డి శ్రీనివాస్, అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, మండల, వార్డు పార్టీ అధ్యక్షులు బంక సత్యం, మజ్జి వెంకటరావు గాడు శ్రీను, కోరాడ లక్ష్మణ, అల్లిపల్లి నరసింగరావు, భీమిలి ఏఎంసీ మాజీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, బోని అప్పలనాయుడు సీనియర్ నాయకులు డోల దేవుడు, పాండ్రంగి అప్పారావు, ఉప్పాడ సూర్రెడ్డి, పిన్నింటి వెంకటరమణ, కర్రి స్వామి, షిణగం దామోదరరావు, లెంక రాంబాబు, కోరాడ అప్పలస్వామినాయుడు, చందక లక్ష్మి, డబ్బీరు ప్రశాంతి, ముదుండి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పరదేశమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో పరదేశమ్మ ఉత్సవాలు తొలేళ్లతో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

## నేడు ముగ్గురు అమ్మవార్ల అనుపోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ

తగరపువలస: దేవదాయశాఖ ఆధ్వర్యంలో సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయ వార్షిక ఉత్సవాలలో భాగంగా మంగళవారం పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్ల అనుపు ఉత్సవం జరగనుంది. ఇదే రోజు ఇక్కడికి సమీపంలోని పోలిపల్లి అమ్మవారి వార్షిక వేడుకలు కూడా జరగనున్నాయి. సంగివలసలో అమ్మవారి ఉత్సవాలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఆలయం ముందు సర్వీస్‌రోడ్డులో వాహనాలను దారి మళ్లించనున్నారు. అనుపు సందర్భంగా ఆలయం వద్ద భారీగా బాణసంచా, నేలవేషాలు, పులివేషాలు, కోలాటం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. భక్తులు క్యూ లైన్లలో అమ్మవార్లను దర్శించుకుని, ఆలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. 16న ఆలయ ఆవరణలో మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.